నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ గురువారం 7 నవంబర్ 2024 | ADILABAD NIRMAL

## స్వచ్ఛంద సేవలు వినియోగించుకుంటాం



మాట్లాడుతున్న పీవో, పాల్గొన్న ప్రతినిధులు

ఉట్నూర్, నవంబర్ 6 : ఏజెన్సీలో విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు మెరుగుపర్చేందుకు స్వచ్ఛంద సంస్థల సేవలను వినియోగించుకుంటామని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. బుధవారం స్థానిక పీవో క్యాంపు కార్యాలయంలో హైదరాబాద్‌కు చెందిన శ్వషోదన్, ధర్మసేన సంస్థ ప్రతినిధులు, డాక్టర్ పూలపల్లి కరుణాకర్‌రెడ్డి, జేనిషాంత్రెడ్డిలతో సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో ఏజెన్సీ ప్రాంతాలలో గిరిజనుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టనున్నారన్నారు. దీనికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సంస్థల ప్రతినిధులు, సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

## డీఏ కోసం ధర్నా




కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ సభ్యులు

ఎదులాపురం, నవంబర్ 6 : పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల, పెన్షనర్ల డీఏలను వెంటనే ప్రకటించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శశికాంత్ డిమాండ్ చేశారు. పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శశికాంత్ మాట్లాడుతూ.. మెడికల్ అలవెన్స్‌ను రూ.3వేలకు పెంచాలని అన్నారు. సీనియర్ సిటిజన్లకు మిగిలిన రాష్ట్రాల్లో ఆర్టీసీ బస్సు చార్జీలు 50 శాతం రాయితీ ఇస్తున్నారని, అదే విధానాన్ని రాష్ట్రంలో అమలు చేయాలని కోరారు. అనంతరం అధికారులకు వినతిపత్రం సమర్పించారు.

# గాడి తప్పుతున్న గురుకులాలు

## అదేబాటలో గిరిజన ఆశ్రమ పాఠశాలలు

- ఫుడ్ పాయిజన్ ఘటనలతో బెంబేలెత్తిపోతున్న తల్లిదండ్రులు
- వాంకిడి ఘటన మరవక ముందే మంచిర్యాలలో ఫుడ్ పాయిజన్
- కొట్టొచ్చినట్లు కనిపిస్తున్న అధికారుల పర్యవేక్షణ లోపం
- ఉమ్మడి జిల్లాలో ఈ యేడాది ముగ్గురు విద్యార్థుల మృతి

“ నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని చించోలి(బి) మైనార్టీ గురుకుల విద్యార్థి అర్బస్ మృతి చెందాడు. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన అప్పస్ అనే విద్యార్థి దాడి చేయడంతో ఆ విద్యార్థి మృతి చెందాడు. గురుకులంలో విద్యార్థులు గొడవ పడేది. కొట్టుకునేది అధికారులకు తెలియలేదా? వారి నిర్లక్ష్యంతోనే అర్బస్ మృతి చెందాడనే ఆరోపణలున్నాయి. *- ఈ ఘటన ఫిబ్రవరి 8, 2024లో జరిగింది.*



వాంకిడి దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థినులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ జరిగింది. ఈ ఘటనలో 75 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం చౌదరి శైలజ అనే విద్యార్థిని వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ చావుబతుకుల మధ్య పోరాడుతున్నది. *- అక్టోబర్ 31, 2024న జరిగిన ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది.*



ఆసిఫాబాద్‌లోని ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందుతున్న ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు

ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదివే మడావి గంగోత్రి(14) వాంతులు, విరేచనాలు చేసుకుని మృతి చెందింది. మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో చూపించి వైద్యుల సూచనల మేరకు ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందింది. కాగా.. గంగోత్రి పాఠశాల బాత్‌రూమ్‌లోనే స్పృహతప్పి పడిపోయి చనిపోయిందని.. పాఠశాల సిబ్బంది పట్టించుకోకపోతే ఆమె మృతి చెందేది కాదంటూ వారి కుటుంబ సభ్యులు ఆరోపించారు. *- ఈ ఘటన అక్టోబర్ 26, 2024న జరిగింది.*



మడావి గంగోత్రి (ఫైల్)

### బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలి..

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌కు కారణమైన హెచ్‌ఎంతోపాటు వార్డెన్‌ను విధుల నుంచి తొలగించాలి. పాఠశాల పర్యవేక్షణలో విఫలమైన ఏటీడీవో, డీటీడీవోలపైనా చర్యలు తీసుకోవాలి. వరుస ఘటనలతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలుండాలి. లేని పక్షంలో జిల్లావ్యాప్తంగా పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతాం.

*-డి.శ్రీకాంత్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు.*

### నిర్లక్ష్యాన్ని ఉపేక్షించొద్దు..



గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ ఘటనపై నిర్లక్ష్యంగా వ్యవ హరించిన ప్రతి ఒక్కరిపైనా చర్యలు తీసుకోవాలి. ఎవరినీ ఉపేక్షించొద్దు. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు తీసుకొచ్చిన గురుకులాలను దెబ్బతీయాలనే కుట్రతోనే కాంగ్రెస్ సర్కారు వాటిని పట్టించుకోవడం లేదు. హరీశ్‌రావు వెళ్లి పరామర్శించే వరకు వాంకిడి గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థినులకు భరోసా ఇచ్చే దిక్కు లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని గురుకులాలు, ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసి, విధులను నిర్లక్ష్యం చేసే అధికారులపై చర్యలు తీసుకోవాలి. గురుకులాలను, ఆశ్రమ పాఠశాలలను బలోపేతం చేయాలి.

*- శ్రావణ్, బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు, మంచిర్యాల.*

మంచిర్యాల, నవంబర్ 6(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలపై సర్కారు పర్యవేక్షణ కొరవడింది. రేవంత్ సర్కారు వచ్చిన 11 నెలల్లోనే ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో చదువే విద్యార్థులు ముగ్గురు మృతి చెందారు. నిన్న(మంగళవారం) నిర్మల్ జిల్లా కేంద్రంలోని మహాత్మాగాంధీ జ్యోతిబా పూలే(ఎంజేపీ)లో తొమ్మిదో తరగతి విద్యార్థి షేక్ అయాన్ హుస్సేన్ పిట్స్ రావడంతో మృతిచెందాడు. వాంకిడి గిరిజన ఆశ్రమ పాఠశాలలో విష ఆహారం తిని అస్వస్థతకు గురైన చౌదరి శైలజ సీరియస్ కండీషన్‌లో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నది. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన వాంకిడి గిరిజన ఆశ్రమ పాఠశాల విష ఆహారం ఘటనను మర్చిపోకముందే బుధవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సాయికుంట గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ అయింది. ఉదయం పెట్టిన కిచిడీ తిన్న పదో తరగతి చదువుతున్న 12 మంది విద్యార్థినులు అస్వస్థతతో ఆసుపత్రిలో చేరారు. ఇలా.. ఉమ్మడి జిల్లాలో వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలు, విద్యార్థుల మరణాలు తల్లిదండ్రుల్లో వణుకు పుట్టిస్తున్నాయి. చదువుకోవడం కోసమని ఇల్లు విడిచి హాస్టళ్లకు వెళ్లిన తమ పిల్లలు ఏమైపోతారో అనే ఆందోళనలో తల్లిదండ్రులు కొట్టుమిట్టాడుతున్నారు.

### కరువైన పర్యవేక్షణ..

గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల నిర్వహణ పూర్తిగా గాడి తప్పిందా అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. అధికారులు రెగ్యూలర్ తనిఖీలు నిర్వహించకపోవడంతో ఘటనలు చోటు చేసుకుంటున్నాయని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. మంచిర్యాల గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ ఘటనపై ఉన్నతాధికారులు ఆరా తీయగా.. ప్రిన్సిపాల్ మాధవ్ ముందస్తు పర్మిషన్ తీసుకోకుండా సెలవు తీసుకున్న విషయం వెలుగులోకి వచ్చింది. ఈ విషయంపై సీరియస్ అయిన ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఆయనను సస్పెండ్ చేశారు. పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులు, వార్డెన్లకు విధుల విషయంలో ఎంత చిత్తశుద్ధితో ఉంటున్నారో.. పాఠశాలలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఏ స్థాయిలో ఉందనేది ఈ ఘటనతోనే తెలిసిపోతుంది. ఉన్నతాధికారులకు తెలియకుండా పాఠశాల ప్రిన్సిపాల్ అనధికారిక లీవ్‌లో వెళ్లడం ఏంటి.. ఇది ఈ ఒక్క పాఠశాలలో జరుగుతుందా లేకపోతే గిరిజన ఆశ్రమ పాఠశాలల అన్నింటిలో జరుగుతుందా అన్నది చర్చనీయాంశంగా మారింది. అన్ని పాఠశాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి విధులను నిర్లక్ష్యం చేసే ఉపాధ్యాయులు, అధికారులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. మంచిర్యాల జిల్లాలో ఫుడ్ పాయిజన్‌కు కారణమైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాయి.

### ఫుడ్ శాంపిల్స్ పరీక్షలకు పంపాం..

మంచిర్యాలలో ఫుడ్ పాయిజన్ కారణంగా 12 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారన్న విషయం తెలుసుకున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ హుటాహుటిన మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి విద్యార్థినులు, వైద్యులతో మాట్లాడారు. అస్వస్థతకు గురైన అందరూ పదో తరగతి విద్యార్థినులని, అంతా స్నేహితులని చెప్పారు. బయటి నుంచి ఏదైనా తీసుకొచ్చి తిన్నారా అంటే తినలేదనే చెప్పారని.. కాకపోతే విద్యార్థులు తిన్న ఆహారం ఫుడ్ శాంపిల్స్‌తోపాటు పాఠశాలలోని తాగునీటి శాంపిల్స్ సేకరించి పరీక్షలు పంపించామన్నారు. ఆ ఫలితాలు వచ్చాక ఎవరైనా తప్పు చేసినట్లు తేలిసే వారిపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పండుగలకు ఇంటికి వెళ్లి వచ్చిన విద్యార్థినులు బయటి నుంచి ఏదైనా ఫుడ్ తీసుకువచ్చారా చెక్ చేయాలని వార్డెన్‌లను ఆదేశించామన్నారు. ప్రత్యేక వైద్య సిబ్బందితో పిల్లలను పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. ఇదే విషయంపై ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ ఖుష్బూ గుప్తా స్పందిస్తూ.. ఇంటి నుంచి తెచ్చిన పచ్చడి కిచిడీలో కలుపుకుని తినడంతో ఇబ్బంది వచ్చిందని చెప్పారు. పిల్లలు తిన్న ఆహారంతోపాటు ఆ పచ్చడి శాంపిల్స్‌ను టెస్టులకు పంపామన్నారు. ఫలితాలు వచ్చాక పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు. అస్వస్థతకు గురైన విద్యార్థినులు మాత్రం ఉడకని లూస్‌గా ఉన్న కిచిడీతోపాటు చింత పులుసు పెట్టారని తెలిపారు. హాస్టల్‌లో వండే ఆహారం పూర్తిగా ఉడకకుండానే పెడుతున్నారని, రోజూ ఇదే పరిస్థితి ఉందని వాపోయారు. మరీ ఈ వ్యవహారంపై అధికారులు ఎలా స్పందిస్తారన్నది వేచి చూడాలి.




వాంకిడి గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల



మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గురుకుల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు



విద్యార్థినులు, డాక్టర్లతో మాట్లాడుతున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



చేను వద్ద కొలం గిరిజన గర్భిణీతో మాట్లాడుతున్న వైద్య బృందం

## ఐదు కిలోమీటర్లు నడిచి.. వైద్యం అందించి

ఎదులాపురం, నవంబర్ 6 : ఆదిలాబాద్ రూరల్ మండలంలోని రాజుగూడ కొలం గిరిజన గర్భిణీ టెకాం శాంతాబాయికి ఆరుగురు పిల్లలు ఉన్నారు. ఇందులో ముగ్గురు ఆడ, మరో ముగ్గురు మగపిల్లలు. ప్రస్తుతం ఆమె ఐదు నెలల గర్భిణీ. ఈమెకు 5.6 గ్రాముల రక్తం మాత్రమే ఉంది. ఏఎన్ఎం చంద్రకళ, ఆశ కార్యకర్త చాగుణ బాయి రెండు నెలల నుంచి శాంతాబాయి ఇంటికి వెళ్లి వైద్య పరీక్షలు, ఐరన్ సుక్రోజ్ ఇంజక్షన్ చేయించుకోవాలని సూచిస్తున్నారు. వైద్యులు మాటి మాటికి ఇంటికొస్తున్నారని ఇంటి నుంచి వెళ్లిపోయి.. పొలం వద్ద మంచె వేసుకుని ఉంటుంది. ఈ విషయాన్ని ఏఎన్ఎం, ఆశ మెడికల్‌లు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ సర్ఫరాజ్‌కు తెలిపారు. దీంతో బుధవారం సర్ఫరాజ్, ఎంఎల్‌హెచ్‌పీ మోహిజాద్దీన్, వైద్యబృందం చంద్రకళ, పవర్ ప్రేమ్‌సింగ్‌లు కుటుంబ సభ్యులతో కలిసి గర్భిణీ ఉంటున్న చేను వద్దకు ఐదు కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లారు. ఆమెకు నచ్చజెప్పి ఖండాల సబ్ సెంటర్‌కు తీసుకొచ్చి ఐరన్ సుక్రోజ్ ఇంజక్షన్‌లు వేయించారు. మళ్లీ ఆమె చేను వద్దకే వెళ్లిపోయింది.

## మాబ్ ఆపరేషన్‌పై శిక్షణ



మాబ్ ఆపరేషన్ శిక్షణలో పాల్గొన్న పోలీసులు

ఎదులాపురం, నవంబర్ 6 : ఆదిలాబాద్ జిల్లా సాయుధ కార్యాలయంలో అసాంఘిక ఘటనలు చోటు చేసుకున్నప్పుడు నిర్వహించే మాబ్ ఆపరేషన్‌పై శిక్షణ ఇస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఎస్పీ గౌష్ ఆలం స్వయంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. స్వీయ రక్షణతోపాటు ప్రభుత్వ ఆస్తులు, ప్రజల ప్రాణాలను కాపాడే సమయంలో చేసే మాబ్ ఆపరేషన్‌పై శిక్షణను నేర్చుకోవాలని సూచించారు. అల్లరి మూకల విధ్వంసం ఉన్నప్పుడు రాళ్లు, కర్రలతో దాడి వంటివి ఉంటాయని, జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆపరేషన్ సురేందర్ రావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు వెంకటి, మురళి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## అప్పు కడతారా? లేకపోతే నీ కూతురు సంగతి చూస్తాం

- అప్పిచ్చిన వారి వేధింపులు భరించలేక కుటుంబం ఆత్మహత్యాయత్నం
- బాసర వద్ద గోదావరిలో దూకిన భార్యాభర్త, కూతురు
- భర్త మృతి.. కూతురు గల్లంతు.. భార్యను కాపాడిన స్థానికులు
- వీరు నిజామాబాద్ జిల్లాకు చెందిన వారిగా గుర్తింపు
- కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న పోలీసులు



అనురాధతో మాట్లాడుతున్న పోలీసులు



మృతుడు వేణు (ఫైల్)



గల్లంతైన పూర్ణిమ (ఫైల్)

బాసర, నవంబర్ 6 : 'అప్పు కడతారా.. లేకపోతే వయస్సులో ఉన్న నీ కూతురు సంగతి చూస్తాం..' అని అప్పు వచ్చిన వారు వేధింపులకు గురి చేయడంతో ఓ కుటుంబం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని నల్కర్ రోడ్‌లో నివాసం ఉంటున్న ఉప్పలించి వేణు-అనురాధలకు కూతురు పూర్ణిమ ఉంది. వీరు ఓ చిన్న వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేవారు. అయితే వీరు గంజి మార్కెట్‌లోని రోషన్, వికాస్‌ల వద్ద సుమారు రూ.3 లక్షలు అప్పుగా తీసుకున్నారు. దీనికి వారు చక్రవడ్డీ వేసి అప్పు కట్టమని వేధించారు. లేదంటే వయస్సులో ఉన్న నీ కూతురు సంగతి చూస్తామని బెదిరింపులకు పాల్పడ్డారు. గత్యంతరం లేక బుధవారం బాసర వద్ద గోదావరిలో దూకారు. గమనించిన స్థానికులు వారిని కాపాడే ప్రయత్నం చేశారు. భర్త వేణు(55) మృతిచెందగా.. కూతురు పూర్ణిమ(25) గల్లంతయింది. భార్య అనురాధను కాపాడారు. అనురాధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు.

## సర్వే షురూ

- ముగ్గురు అధికారులకు షోకాజ్ నోటీసులు
- సర్వేను పరిశీలించిన కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్, నవంబర్ 6(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులాల సర్వే బుధవారం ప్రారంభమైంది. ఆదిలాబాద్ మున్సిపాలిటీలోని పలు వార్డులతోపాటు గ్రామాల్లో అధికారులు, సిబ్బంది ఇంటింటా పర్యటించి వివరాలతో కూడిన స్టిక్కర్లు అంటించారు. జిల్లాలోని 17 మండలాల పరిధిలో 473 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలోని 1,49,151 ఇండ్లలో 1,612 మంది ఎన్యుమరేటర్లు, 173 మంది సూపర్‌వైజర్లు, ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలో 48,393 ఇండ్లలో 385 ఎన్యుమరేటర్లు, 41 మంది సూపర్‌వైజర్లు సర్వేలో పాల్గొన్నారు. కలెక్టర్ రాజర్షి షా పట్టణంలోని ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలో గల ఓల్డ్ హౌసింగ్ బోర్డులో సర్వే తీరును పరిశీలించారు. జిల్లాలో 1.97 లక్షల కుటుంబాల సర్వే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.


### అధికారులకు నోటీసులు

ఇచ్చోడ మండలంలోని ముక్రా(కే), గేర్జాం గ్రామాల్లో కలెక్టర్ రాజర్షి షా పర్యటించి సర్వే తీరును పరిశీలించారు. గెర్జాంలో ఇండ్ల సర్వేను సరిగా నిర్వహించకపోవడం, స్టిక్కర్లపై సరైన వివరాలు నమోదు చేయకపోవడం, సర్వే మ్యాప్ ద్వారా ఎక్కడి నుంచి ఎక్కడి వరకు నిర్వహించాలో అనే విషయాన్ని అధికారులు నిర్ధారించకపోవడంతో ఇచ్చోడ ఎంపీడీవో లక్ష్మణ్, మండల వ్యవసాయ అధికారి కైలాస్, పంచాయతీ కార్యదర్శి ఏజాజ్ హస్మీలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమగ్ర ఇంటింటి సర్వేకు సంబంధించి శిక్షణలు, సమావేశాలు, గూగుల్ మీట్, టెలి కాన్ఫరెన్స్‌ల ద్వారా అధికారులు సిబ్బందికి అవగాహన కల్పించినా విధులు సక్రమంగా నిర్వహించకపోవడంతో నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు.



గెర్జాం గ్రామంలో సర్వే వివరాలను పరిశీలిస్తున్న కలెక్టర్

## గ్రూప్-3 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, నవంబర్ 6 : గ్రూప్-3 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో గ్రూప్-3 పరీక్షల నిర్వహణపై రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈనెల 17,18 తేదీల్లో నిర్వహించనున్న గ్రూప్-3 పరీక్షను ప్రశాంతంగా నిర్వహించాలని అధికారుల కు సూచించారు. జిల్లా కేంద్రంలో 24 కేంద్రాలను ఏర్పాటు చేశామని, 8,124 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతున్నారన్నారు. పరీక్ష కేంద్రాల్లో వైద్య సిబ్బంది, మందులను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ సమావేశంలో డీఈవో రవీందర్‌రెడ్డి, పరీక్షల ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి గంగారెడ్డి, డీఎంహెచ్‌వో రాజేందర్, కమిషనర్ ఖమర్ అహ్మద్, డీఎం ప్రతిమారెడ్డి పాల్గొన్నారు.

### గర్భస్థ మహిళా మరణాలు తగ్గించేందుకు చర్యలు

గర్భస్థ మహిళా మరణాలను తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం వైద్యశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గర్భం దాల్చిన వెంటనే మహిళలకు అన్ని రకాల పరీక్షలు నిర్వహించి హైరిస్క్ గర్భిణులను గుర్తించాలన్నారు. ప్రసూతి ఆసుపత్రిలో గర్భిణులలో హృద్రోగ నిర్ధారణ కోసం టుడీఇకో నిర్వహించేందుకు సామగ్రిని సమకూర్చుకోవాలని ఆదేశించారు. డీఎంహెచ్‌వో రాజేందర్, వైద్యాధికారులు శ్రీనివాస్, సురేశ్, సౌమ్య, సరోజ, నయనారెడ్డి పాల్గొన్నారు.